క్లుప్తంగా

'పేదల పక్షాన పోరాడేది సీపీఎం'



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్ : పేదల పక్షాన పోరాటం చేసేది సీపీఎం మాత్రమే అని ఆ పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27, 28 తేదీల్లో పట్టణ కేంద్రంలో జరిగిన సీపీఎం జిల్లా 3వ మహాసభలు, బహిరంగ సభను విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలు, సహకారం అందించిన నాయకులకు కృతజ్ఞత తెలిపారు. మహాసభల స్ఫూర్తితో పార్టీ విస్తరణకు ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనునిత్యం పేదల పక్షాన పోరాటం చేస్తున్నామని కార్మిక, కర్షక, మహిళ, యువత, విద్యార్థి హక్కుల కోసం సమరశీల పోరాటం చేపడుతామన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, చిలుముల్ల భాస్కర్, తొడెంగల ఐలయ్య, శివునిపల్లి శాఖ కార్యదర్శి భూసెట్టి రాంబాబు పాల్గొన్నారు.

కుంగిన ఐలాండ్



జనగామ : ట్రాఫిక్ నియంత్రణ కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన జంక్షన్లలో పోలీసులు ఐలాండ్లు (అంబరెల్లా)ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ చౌరస్తా నాలుగు రోడ్ల కూడలితో పాటు సిద్దిపేట రోడ్డు, నెహ్రూపార్కు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం తదితర ప్రాంతాల్లో వీటిని నెలకొల్పారు. అయితే ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా ఉన్న ఐలాండ్ ఒక్కసారిగా కుంగిపోయింది. వాహనం ఢీ కొట్టిందా లేదా రోడ్డు కింద పైపులైన్ లేదా ఇంకేమైనా ఉందా అనే సందేహాలు వినిపిస్తున్నాయి. కుంగి ప్రమాదకరంగా మారిన ఐలాండర్‌ను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే, సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం, నిర్వహించారు. ఆదివారం మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లి అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం

కేయూ క్యాంపస్ : డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద మనుస్మృతి ప్రతులను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించటమే నేరమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భగత్‌సింగ్ స్టూడెంట్స్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 25న మనుస్మృతి వ్యతిరేక శాంతి సమావేశాన్ని నిర్వహించగా మనువాద, మతోన్మాద గుండాలు బీఎస్‌ఎం విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టించారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ రాష్ట్ర కోకన్వీనర్ గణేష్, జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, యూనివర్సిటీ కన్వీనర్ శివ, సునీల్, శంకర్, సంజయ్, అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంతలో సౌకర్యాలు కరువు


ఎండలోనే నిల్చున్న వ్యాపారస్తులు, రైతులు


అంగడిలో ఎండలో కట్టేసిన పశువులు

ఎండలోనే వ్యాపారులు, పశువులు
- తాగేందుకు నీరు లేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బచ్చన్నపేట : ప్రతి ఆదివారం మండల కేంద్రంలో కూరగాయలు, పశువుల సంత జరుగుతుంది. కూరగాయలను పట్టణంలోని రోడ్డు పైనే విక్రయిస్తుండగా, పశువులను మాత్రం గ్రామ చివరలో ఓ దాత ఇచ్చిన స్థలంలో నిర్వహిస్తున్నారు. పశువులతో పాటు జీవాలను కూడా విక్రయిస్తారు. అయితే సంత వేలం మాత్రం ప్రతి ఏటా రూ.లక్షల్లో ఉంటుంది. అంగట్లో మాత్రం పశువులు, వ్యాపారులు ఎండకు ఉండకుండా రేకుల షెడ్లను వేస్తామని, వసతులు కల్పిస్తామని చెప్పి టెండర్ పూర్తయ్యాక పనులను మాత్రం చేయడం లేదు. ఈ సంతలో పశువులను అమ్మడానికి చేర్యాల, నర్మెట, తరిగొప్పుల, జనగామ, ఆలేరు, రాజపేట, జగదేవపూర్ మండలాల నుంచే కాకుండా ఇతర మండలాల గ్రామస్తులు క్రయ, విక్రయాలకు వివిధ ప్రాంతాల నుంచి వస్తారు. వారికి కనీసం తాగునీటి వసతి కూడా కల్పించడం లేదు. అంగడికి వచ్చిన పశువులు నీరు తాగడానికి ఇబ్బందులు పడుతున్నాయి. అంగడి కూడా పట్టణానికి కొద్ది దూరంలో ఉండగా, నీరు తాగాలంటే పశువులను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి. సంతలో రేకుల షెడ్డు లేకపోవడంతో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా చెట్ల కిందకు వెళ్లాల్సి ఉంటుంది. వేలం పాట సమయంలో అన్ని వసతులు కల్పిస్తామని, ఆ తర్వాత దానిని దాటవేస్తున్నారని, సంతలో వసతులు కల్పించాలని వ్యాపారస్తులు, మండల ప్రజలు అంటున్నారు.

అంగట్లో వసతులు లేవు



గ్రామాల్లో రైతుల వద్ద పశువులను కొనుగోలు చేసి సంతకు తీసుకు వచ్చి ఇక్కడ విక్రయిస్తాం. పశువులను విక్రయించినపుడు అమ్మిన వారు, కొన్నవారు డబ్బులు చెల్లించి రహదారి చేయించుకోవాలి. అంగడికి వచ్చిన వారికి, తీసుకు వచ్చిన వారికి, పశువులకు కనీస వసతులు సంతలో లేవు. రశీదు డబ్బులు మాత్రం సరిగ్గానే తీసుకుంటున్నారు.
– బాగయ్య, పశువుల వ్యాపారి

వసతులు కల్పిస్తాం..



పశువుల సంతలో వసతులు కల్పిస్తాం. వర్షం వస్తే వ్యాపారస్తులు తడవకుండా ఉండడానికి రేకుల షెడ్లను వేసి, పశువులు కూడా ఉండేలా వసతుల కల్పనకు కృషి చేస్తాం. సంతలో మిషన్ భగీరథ పైపు లైన్ కనెక్షన్ పెట్టాము.ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– నర్సింహాచారి, పంచాయతీ కార్యదర్శి

బాధిత కుటుంబాలకు పరామర్శ


జనగామ రూరల్: బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు


కొడకండ్ల: నగదు అందజేస్తున్న యాకయ్య

జనగామ రూరల్ : మండలంలోని శామీర్‌పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్వాల నర్సింగరావు భార్య అనారోగ్యంతో మృతిచెందింది. కాగా బాధిత కుటుంబాన్ని ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసి పరామర్శించారు. కుటుంబానికి ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను వారి కుటుంబాలను కాపాడుకోవడం పార్టీ బాధ్యత అని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గంగారబోయిన మల్లేష్ తల్లి మృతి చెందగా వారిని సైతం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కొడకండ్ల : మండల కేంద్రానికి చెందిన అందె వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె చంద్రయ్య, సైదులు, యాకన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

భార్య, కుమారుడి అప్పగింత


భార్య,కుమారుడిని అప్పగిస్తున్న పోలీసులు

జనగామ రూరల్ : ఒడిశాకు చెందిన మానసిక స్థితిలేని ఓ మహిళతో పాటు ఆమె కుమారుడిని గమనించిన తోటి ప్రయాణికుడు ఈనెల 27వ తేదీన జనగామ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులకు అప్పగించాడు. అనంతరం వారిని పోలీసులు సఖి కేంద్రానికి తరలించారు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఆదివారం సదరు మహిళ భర్త సఖి కేంద్రానికి వచ్చాడు. బాధితురాలితో పాటు తన కుమారుడిని జనగామ పోలీసుల సమక్షంలో భర్తకు అప్పగించారు. తిరిగి ఒడిశా వెళ్లే రైలు ఎక్కించి సాగనంపారు.

బహుమతుల ప్రదానం



పాలకుర్తి : మండల కేంద్రంలో న్యూస్టార్ చైనీస్ కుంగ్‌ఫూ జనరల్ మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించగా 50 మంది విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. వీరికి న్యూస్టార్ కుంగ్‌ఫూ అకాడమి చైర్మన్ ఎండీ సలీం పాష ముఖ్య అతిథిగా పాల్గొని బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం

- జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న ఆది సాయన్న

రఘునాథపల్లి : సమసమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయమని, దేశంలో అంతరాలు లేని సమాజం కోసం కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ ఆవిర్భావం నుంచి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. దేశంలో మతాలు, కులాల మధ్య కొంత మంది విబేధాలు సృష్టిస్తూ అమాయక ప్రజల ఉసురుపోసుకునే మతోన్మాదులు దేశ ద్రోహులని పేర్కొన్నారు. దేశంలో కమ్యూనిస్టులే నిజమైన దేశ భక్తులని పేర్కొన్నారు. స్వాతంత్రం కోసం పని చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆయన కొనియాడారు. సీపీఐతోనే పేదలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, బీర్రు నాగేష్, నర్సయ్య, యాదయ్య, శంకర్, ఐలయ్య, గిరి, మహేష్, అంజమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం


సన్మానిస్తున్న రవీందర్ రెడ్డి తదితరులు

బచ్చన్నపేట : నారాయణపురం గ్రామంలోని శ్రీరామ శివాలయ నిర్మాణానికి సహకరించిన పలువురు దాతలను మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి సన్మానించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయానికి నిత్య పూజా సామగ్రి, పూజారి వేతనాన్ని చెల్లించేందుకు గ్రామానికి చెందిన గడ్డం వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. పూజా సామగ్రితో పాటు, ఆలయ పూజారికి నెలకు రూ.8వేల వేతనం కూడా చెల్లిస్తారని అన్నారు. అలాగే పలువురు దాతలు కూడా ఆలయా నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువకులు

ధర్మసాగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డీసీసీబీ డైరెక్టర్, ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనవరి 1న ఆయన పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని సుష్మిత గార్డెన్లో ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కంటే రక్తదానం గొప్పదని తెలిపారు. మీరు చేసే రక్తదానం ఒకరి ప్రాణాలను కాపాడుతుందని అలాంటి సందర్భాల్లో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు. మెగా శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన సుమారు 100 మంది దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పాకురుతో పొంచి ఉన్న ప్రమాదం

కాజ్‌వేపై అదుపు తప్పుతున్న వాహనాలు
- జారిపడుతున్న ప్రయాణికులు
- నిరంతర నీటిప్రవాహంతో నాచుపట్టిన రోడ్డు
- బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు


నిడిగొండ-ఫతేషాపూర్ మధ్యలో కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు

రఘునాథపల్లి : నిత్యం రాకపోకలు సాగించే బీటీ రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది..దీంతో అటు వైపు వెళ్లే ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని నిడిగొండ -ఫతేషాపూర్ మధ్యలో గల కాజ్‌వేపై నీటి ప్రవాహంతో రోడ్డుపై పాకురు పట్టి ప్రమాదకంగా మారింది. ఫతేషాపూర్ తాళ్లం చెరువు నుంచి వచ్చే వరద, పొలాల నీరు ఈ రహదారిపై నుంచి ప్రవహిస్తోంది. భూమట్టంలో నిర్మించిన కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుండటంతో ఆరు నెలలుగా నీటిని దాటుకుంటూ ప్రయాణించడం చాలా ఇబ్బందిగా ఉంది. కాలినడకన వెళ్లే వారు సైతం జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిపై పైపులు లేకపోవడంతో నెలల తరబడి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మితండా, మాదారం, రామచంద్రగూడెం గ్రామాల ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఆదివారం ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో అదృష్టవశాత్తు బైకుపై ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ విషయాన్ని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ తీగల కింద గాలిపటాలొద్దు



సంక్రాంతి పండుగకు స్పెషల్ అట్రాక్షన్‌గా.. పిల్లల నుంచి పెద్ద వారి వరకు ఆటవిడుపు గాలిపటాలతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఊరూరా ప్రచారం చేస్తోంది. గతంలో విద్యుత్ తీగలకు గాలిపటాలు చిక్కుకొని జరిగిన ప్రమాదాలను వివరిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్తు తీగలకు గాలిపటాలు తగిలితే ప్రమాదాలకు చోటుచేసుకోవడంతో పాటు కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతోందని వివరిస్తున్నారు. ఎత్తైన భవనాలు, విద్యుత్ లైన్ల కింద, వాటి సమీపంలో గాలిపటాలు ఎగర వేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. పిల్లలు గాలిపటాలు తీసుకుని బయటికి వెళ్లే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరుతున్నారు.
– జనగామ

కొనసాగుతున్న ఇంటింటి సర్వే


సర్వేను పరిశీలిస్తున్న రాజేశ్వర్

జఫర్‌గఢ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇంటింటి సర్వే మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతోంది. ఆదివారం మండలంలో నిర్వహిస్తున్న సర్వేను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సర్వేను సమగ్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా సర్వేను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ ఠాకుర్ వివేక్‌సింగ్‌తో పాటు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సేవచేయడం గొప్ప విషయం


అన్నదానం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

జనగామ రూరల్ : పేదలకు సేవ చేయడం గొప్ప విషయమని రొండ్ల జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు జనగామ పట్టణానికి చెందిన రొండ్ల లక్ష్మారెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అన్నదానం చేశారు. పట్టణంలో తన తండ్రి అనేక సేవా కార్యక్రమాలు చేసేవారనిఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు మంతెన మణి, వంగ బీమ్‌రాజ్, శంకర్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మండలంలోని శామీర్‌పేటలో గల కోమటిరెడ్డి సుశీలమ్మ రుద్రమదేవి ఓల్డ్ ఏజ్‌హోమ్‌లో హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన తాళ్లూరి భవాని లక్ష్మీ నరసింహరావు కూతురు సాయి సిరిచందన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. నిర్వాహకులు లక్ష్మణ్, వృద్ధులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేయొద్దు


దేవరుప్పుల: మాల్యతండాలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు


బచ్చన్నపేట: రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై హమీద్

దేవరుప్పుల : నిషేధిత గుడుంబా తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లకావత్ తండా గ్రామ పరిధి మాల్యతండాకు చెందిన భూక్య భాస్కర్ ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, 70 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ ఆదాయం పేరిట గుడుంబా తయారీ, అమ్మకాలతో సామాన్య కుటుంబాలు ఆగం అవుతాయని అన్నారు. గుడుంబా తయారు చేస్తున్న భాస్కర్‌పై తదుపరి చర్యలకు పాలకుర్తి ఎక్సైజ్ అధికారులకు సిఫారసు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకొండలో ఇసుక ట్రాక్టర్ సీజ్

దేవరుప్పుల మండలంలోని కోలుకొండ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసినట్టు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. సదరు ట్రాక్టర్ యజమాని కొడగాని కృష్ణమూర్తిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగిఉండాలి

బచ్చన్నపేట : మండలంలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎస్‌కే హమీద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కేసుల్లో, వివాదాలలో జోక్యం చేసుకున్న వారిపై రౌడీ షీట్ కేసు నమోదు చేస్తామని వారిని పిలిపించి మాట్లాడారు. గ్రామాల్లో అల్లర్లు జరిగితే ఆ గ్రామంలోని రౌడీషీటర్లే బాధ్యత వహించాలని, అందుకే వివాదాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిపై రౌడీ షీట్‌ను ఎత్తివేస్తామని చెప్పారు. మండల వ్యాప్తంగా పలు వివాదాల్లో జోక్యం చేసుకున్న వారిపై రౌడీ షీట్లను నమోదు చేశారని మొత్తం 14 మంది రౌడీ షీటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సిరెడ్డి, కానిస్టేబుళ్లు జమాలొద్దీన్, అనిల్, రాకేష్, దివ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మండల అధ్యక్షుడిగా యుగంధర్


ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రమోద్‌కుమార్

జఫర్‌గఢ్ : ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా జఫర్‌గఢ్‌కు చెందిన అంచూరి యుగంధర్ గెలుపొందారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొత్తం 199 ఓట్లకు గాను 176 ఓట్లు పోలయ్యాయి. ఇందులో యుగందర్‌కు 89 ఓట్లు రాగా బజ్జూరి మణికాంత్‌కు 87 ఓట్లు పోలయ్యాయి. రెండు ఓట్ల తేడాతో యుగందర్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి మాదంశెట్టి వరుధిని ప్రకటించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ చేతుల మీదుగా గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో భిక్షపతి, అనూజ, గన్ను నర్సింహులు, సంతోష్‌కుమార్, రవీందర్, అంజనేయులు, వేణుగోపాల్, జిల్లా రాములు, గందె సోమన్న, శ్రవణ్‌కుమార్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

జనగామ రూరల్ : మండలంలోని గానుపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000కు చెందిన పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూజించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య, రమేష్ బాబు, విజయలక్ష్మి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇరుగు సిద్ధులు, మిట్ట సురేష్, జి.రాములు, గోనెల శేఖర్, బబ్బూరు సంతోష్, కర్రె కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.